# అమాత్యా.. ఆలకించరా?

▸ మొదటిపేజీ తరువాయి...

రంగాపూర్ గ్రామాల్లోని అనేక మంది రైతులకు రుణమాఫీ కాక ఆందోళనకు గురవుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా సరైన సమాధానం లభించడంలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తచేస్తున్నారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి జిల్లాలో మొదటి విడుతలో 29,724 మంది రైతులకు రూ. 149.42కోట్లు, రెండో దఫా 13,238 మందికి రూ. 122.43 కోట్లు, మూడో విడుతలో 8,268 మందికి రూ. 101.75కోట్లు, మొత్తంగా జిల్లావ్యాప్తంగా 51,393 మంది రైతులకు రూ. 375.58 కోట్ల రుణమాఫీ చేశారు. మాఫీ ప్రక్రియ పూర్తయిందని స్వయంగా సీఎం ప్రకటించడంతో రుణమాఫీ కానీ దాదాపు 60శాతం మంది పరిస్థితి ఏమిటని రైతులు మదనపడుతున్నారు. రొంపికుంటకు చెందిన 300మంది రైతులు పెద్దపల్లిలోని ఇండియన్ బ్యాంక్, సబ్బితంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కమాన్‌పూర్‌లోని కేడీసీసీ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. ఇందులో 40 శాతం మంది రైతుల రుణాలు మాత్రమే మాఫీ కాగా లక్షలోపు రుణాలు ఇంకా మాఫీకి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో నమస్తే తెలంగాణ వారిని పలకరించగా వారి మనోభావాలను ఇలా వెల్లడించారు.

**మంత్రి దుద్దిళ్ల ఇలాకా.. రైతుకు ధోకా!**



రొంపికుంట గ్రామ పంచాయతీ వద్ద రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



AD-TGAGRL • Messages • Now

రైతు సంక్షేమానికి, వికాసానికి కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వం "రైతు ఋణ మాఫీ - 2024" క్రింద శ్రీ JANGILI SRAV గారికి,రూ18056/- బ్యాంక్ ఖాతా నంబర్ XXXXXX0267 IOB Sabitham బ్రాంచ్ యందు తేది 18.07.2024 న జమ చేయబడినది. వివరాలకు మీ బ్యాంక్ అధికారిని/మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగలరు.

మీ ఈ ఆనందంలో పాలుపంచుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది.

మీ ముఖ్యమంత్రి

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి.

జంగిలి శ్రావణ్‌కుమార్ అనే రైతుకు రుణమాఫీ జరిగినట్టు వచ్చిన మెసేజ్

## సీఎం రాజీనామా చేయాలి



రెండు గడువులు దాటినా రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ జరగలేదు. రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా? సంపూర్ణంగా రైతులకు రుణమాఫీ చేస్తారా? అనే విషయాన్ని తేల్చుకోవాలి. మా గ్రామంలో 150 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ చేయని పక్షంలో ఆందోళనకు దిగుతాం.

**-కొయ్యడ రవి, రొంపికుంట, కమాన్‌పూర్**

## మాఫీ డబ్బులు జమ కాలేదు..



ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.18వేల లోన్ తీసుకున్నా. తొలివిడుత రుణమాఫీ జాబితాలో పేరు వచ్చింది. బ్యాంకులో అడిగితే అసలు మాఫీ అయ్యిందని, వడ్డీ కట్టి, వన్ బీ పహాణీ, ఆధార్ జిరాక్స్ ఇవ్వమన్నారు.వడ్డీ రూ.1300 కట్టి, ధృవీకరణ పత్రాలు ఇచ్చిన. నెల అవుతున్న ఇంకా ప్రభుత్వం నుంచి ఖాతాకు డబ్బులు రాలేదు.

**- జంగిలి శ్రావణ్‌కుమార్, రొంపికుంట**

## ఖాతా లెక్కలు చెప్తలేరు



కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్‌లో రూ. లక్ష రుణం 2023 ఆగస్టులో ఒక్కసారే మాఫీ అయింది. మళ్లీ అదే బ్యాంక్‌లో 28 అక్టోబర్ 2023న రూ.52వేల లోన్ తీసుకున్న. రుణమాఫీ అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నా.. మూడు విడుతల్లోనూ మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే నేను 2016లో రుణం తీసుకున్నట్టు చెబుతున్నరు. నేను 2016లో రుణం తీసుకుంటే కేసీఆర్ చేసిన మాఫీ ఎటు పోయిందని అని అడిగితే కసురుకుంటున్నరు. ఖాతాలెక్కలు అడిగితే కర్సయితయ్ అంటున్నరు.

**-కే రవి, రొంపికుంట, కమాన్‌పూర్**

## మాఫీపై సమజైతలేదు



కేసీఆర్ హయాంలో నాకున్న లోను రూ. 49వేలు వడ్డీతో రూ. 54వేలు ఒకేసారి మాఫీ అయ్యింది. మళ్లీ ఆగస్టు నెలలోనే పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్‌లో రూ. 54వేలు రుణం తీసుకున్నా. రైతు రుణమాఫీకి నాకు అన్ని అర్హతలున్నాయి. కానీ మూడు లిస్ట్‌ల్లోనూ నా పేరు రాలేదు. గిట్లెందుకు అయిందో సమజైతలేదు.

**-కే మల్లేశ్, రొంపికుంట, కమాన్‌పూర్**

## రైతులతో ఆందోళన చేస్తాం



రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోంది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మాఫీ చేసింది పావలా వంతు. చెప్పుకునేది రూపాయి వంతు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలి. మాఫీ చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తాం.

**- ఉప్పరి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ, కమాన్‌పూర్**

## 40 శాతం మందికే మాఫీ..



మా కమాన్‌పూర్ మండలంలో 40శాతం మంది రైతులకే మాఫీ అయింది. కమాన్‌పూర్ సహకార సంఘం నుంచి 34మంది, పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్ నుంచి 80 మంది, సబ్బితంలోని ఇండియన్ ఓవర్సిస్ బ్యాంకు నుంచి దాదాపు 200ల మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. రైతులను ఇబ్బంది పెట్టడం రేవంత్ సర్కారుకు తగదు.

**- చిందం తిరుపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్, కమాన్‌పూర్**

## బ్యాంకుల్లో బారులు



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో యూరియా బస్తాల కోసం గంటల కొద్ది రైతులు క్యూలైన్‌లో నిల్చొని ఉండేవాళ్లు. ఇప్పుడు రుణమాఫీ కోసం బ్యాంకుల ముందు గంటల తరుబడి బారులు తీరుతున్నరు. రొంపికుంటలో చానామందికి రుణాలు మాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ చేయాలి.

**-కొయ్యడ కుమార్, రొంపికుంట, కమాన్‌పూర్**

## కాంగ్రెస్ గొప్పలు సిగ్గుచేటు



పెద్దపల్లి ఇండియన్ బ్యాంకులో రూ. 80 వేలు లోన్ తీసుకున్న. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల్లో నా పేరు రాలేదు. లక్ష లోపు ఉన్న నాకు మాఫీ కాకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పడం సిగ్గుచేటు. రైతులు ఆగమవుతుంటే వరంగల్‌లో రుణమాఫీ కృతజ్ఞత సభ పెడుతామని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరం.

**-తాళ్ల కనకయ్య, తెనుగుపల్లి, కమాన్‌పూర్**

## మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు


## రైతుల ప్రయోజనం కోసమే రహదారి

-ప్రభుత్వ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాం
-మాతోపాటు 140 మందికి పైగా రైతులకు మేలు
-అసైన్ భూమి కబ్జా అవాస్తవం
-జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ స్పష్టీకరణ

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలోని నాగన్‌పల్లి, అనాజీపూర్ గ్రామాల పరిధిలోని వందలాది మంది రైతులతో పాటు తమ పట్టా భూముల్లోకి వెళ్లేందుకు సరైన రహదారి లేదని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నది. తమ కంపెనీకి అనాజీపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 276, 277, 278, 279, 280, 281లో 175 ఎకరాల పట్టా భూమి ఉందని తెలిపింది. అదేవిధంగా సర్వే నెంబర్ 261, 271, 272, 273, 274లో మరో 40 ఎకరాల పట్టా భూమి ఉందని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ స్పష్టంచేసింది. ఇలా మొత్తం 215 ఎకరాల పటాస్ భూమి ఉందని, వాస్తవానికి 1993లో ఈ భూములను రాఘవేంద్ర ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు రైతుల నుంచి కొనుగోలు చేశారని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి తెలిపారు. రాఘవేంద్ర ప్రసాద్, అతని కుటుంబ సభ్యుల నుంచి తాము జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ పేరిట ఆ భూములను కొనుగోలు చేశామన్నారు. జీనియస్ కన్‌స్ట్రక్షన్స్‌లో ఇతరుల ఎవరి భాగస్వామ్యం లేదని వివరించారు. అదేవిధంగా ఇందులో ఒక్క గజం కూడా అసైన్ భూమి లేదని స్పష్టంచేశారు. తమతో పాటు ఈ సర్వే నంబర్లలో వందలాది మంది రైతులకు కూడా వ్యవసాయ భూములు ఉన్నాయని చెప్పారు. ఈ భూములను ఆనుకొని నాగన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 189లో మరి కొంతమంది రైతులకు వ్యవసాయ భూములు ఉన్నాయని, కానీ ఈ భూముల్లోకి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. అందుకే అందరికీ ప్రయోజనం ఉంటుందనే సదుద్దేశంతో రహదారి ఏర్పాటు చేసుకుంటే మంచిదని తమ కంపెనీతో పాటు రైతులందరూ అనుకున్నామని, ఈ మేరకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు జీనియస్ కంపెనీ ప్రతినిధి తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రహదారి నిర్మాణ పనులు చేసేందుకు సహకరించాలని రైతులు తమను కోరినట్లు పేర్కొన్నారు. మాతో పాటు రైతులకు కూడా మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఆ ప్రతిపాదనకు తాము అంగీకరించామన్నారు. కానీ అసైన్ భూములు కబ్జా చేశారనే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

**గతంలో అనుమతులిచ్చారు...**

రైతుల, ఇతర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా అసైన్ భూముల్లో రహదారి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి తెలిపారు. ఈ మేరకు జీవోలు కూడా జారీ అయ్యాయని అన్నారు. అదేరీతిన రైతులతో కలిసి తాము కూడా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నమేగానీ ఇందులో ఒక్కరి ప్రయోజనం లేదన్నారు. రహదారి నిర్మాణం ప్రభుత్వ అనుమతి వచ్చిన తర్వాత మాత్రమే పనుల చేపడుతామని, ప్రస్తుతం తమ కంపెనీకి చెందిన పట్టా భూములను చదునుచేసే పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ క్రమంలో ఇందిరా సాగర్ బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి మట్టి, బండరాళ్లు పారబోయడం లేదని, అలాంటి వార్తల్లో నిజం లేదన్నారు.

**రహదారి కోసమే మా ప్రయత్నం...**

తమ భూములతో పాటు అనాజీపూర్ గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదని ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య గౌడ్, నల్లా బాలరాజు, నెట్టు బాలయ్య, సీహెచ్ బాలయ్య, ఎం అబ్బయ్య, బాలరాజు ఎస్ బుగ్గయ్య, రమణయ్య అనే రైతులు తెలిపారు. ఇందుకోసం తమ భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేసేందుకు ముందుకొచ్చామని అన్నారు. రహదారి నిర్మాణానికి సహకరించాలని జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీని కోరామని, అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని వాళ్ళు కూడా అంగీకరించినట్లు రైతులు చెప్పారు. కానీ తమ భూములను ఇతరులు ఆక్రమించారనే వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.







# 2 లక్షల మాఫీ ఒక్కరికీ కాలేదు

- జుక్కల్‌లో రైతులకు మొండిచెయ్యి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం

సంగారెడ్డి, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రూ. 2లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ గ్రామంలోని రైతుల్లో కనీసం ఒక్కరికి కూడా 2లక్షల రుణమాఫీ కాలేదు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని జుల్కల్ గ్రామ పంచాయతీలో 3వేల జనాభా, 2800 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. 1000 మందికిపైగా రైతులు ఉన్నారు. వీరిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ. గ్రామంలోని 500 మందికిపైగా రైతులు కందిలోని ఎస్‌బీఐ, కోఆపరేటివ్ బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకుంటున్నారు. రేవంత్ సర్కార్ గ్రామంలో మొదటి విడతగా 158 మంది, రెండో విడతలో 72 మంది రైతులకు రుణమాఫీ చేసింది. మూడో విడతలో ఒక్కరికీ పంటరుణం మాఫీ కాలేదు. దీంతో గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం గ్రామంలో 70 శాతానికి పైగా రైతుల రుణాలు మాఫీ కావాలని, కానీ సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నమ్మించి మోసం చేయొద్దు



నేను కోఆపరేటివ్ బ్యాంకులో రూ.1.94 లక్షల పంట రుణం తీసుకున్నా. రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పటంతో సంతోషపడ్డా. కానీ నాకు రూ.1.94 లక్షల పంటరుణం మాఫీ కాలేదు. ప్రభుత్వం నాలాంటి రైతులను నమ్మించి మోసం చేయడం సరికాదు.

**-కొత్తగాడి నర్సింలు, జుల్కల్, సంగారెడ్డి జిల్లా**

## ఆశలు అడియాసలయ్యాయి



కంది కోఆపరేటివ్ బ్యాంకులో రూ.2 లక్షల పంట రుణం తీసుకున్న. అర్హత ఉన్నా నాకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదు. రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు అన్నీ ఉన్నాయి. రేవంత్ సర్కార్ నా ఆశలను అడియాసలు చేసింది. ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి.

**-కలివేముల పాండు,జుల్కల్, సంగారెడ్డి జిల్లా**

## దండం పెడతా.. మాఫీ చేయండి



మా కుటుంబంలో మా అమ్మకు, నాకు పంట రుణం ఉంది. పట్టాదారు పాస్‌పుస్తకాలు వేర్వేరుగా ఉన్నాయి. మూడు విడతల్లోనూ మాకు లోన్ మాఫీ కాలేదు. అటు రైతుభరోసా ఇవ్వక, ఇటు రుణమాఫీ కాక కష్టాలు పడుతున్నాం. రుణమాఫీ చేస్తే మళ్లీ రుణం తీసుకొని పంటలు సాగు చేసుకుంటాం కదా? సీఎం గారూ.. మీకు దండం పెడతాం.. మా రుణాలు మాఫీ చేయండి.

**-మాలోత్ పూల్‌సింగ్, మంగ్యాతండా, టేకులపల్లి**

## రేషన్‌కార్డు లేకుంటే మాఫీ చేయరా?



దుమ్ముగూడెం సహకార బ్యాంకులో రెండేండ్ల క్రితం రూ.18 వేల పంట రుణం తీసుకున్నాను. మూడు విడతల్లోనూ నా పేరు రాలేదు. బ్యాంకు సిబ్బందిని అడిగితే సమాచారంలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులనూ సంప్రదించాను. మా నాన్న రేషన్‌కార్డులో నా పేరు ఉందని చెప్పారు. నాకు సపరేట్ రేషన్‌కార్డు లేనంత మాత్రాన నా పంట రుణాన్ని మాఫీ చేయరా?

**-కాశిబోయిన సతీశ్, బండిరేవు, దుమ్ముగూడెం**

## రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పింది

- కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో రూ.40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి, బడ్జెట్లో రూ.26 వేల కోట్లు కేటాయించారని.. చివరికి రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని మండిపడ్డారు. 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? అని ప్రశ్నించారు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు కడుపుమండి కాంగ్రెస్ దిష్టిబొమ్మలను కాలుస్తున్నారని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రుణమాఫీ సహా 6 గ్యారెంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు విలీన డ్రామాలు ఆడుతున్నదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

## రెన్యువల్ చేసినా రుణమాఫీ కాలె



2019లో రూ.2 లక్షల రుణం తీసుకున్న. అప్పటి నుంచి ఏటా మిత్తి చెల్లించి రెన్యువల్ చేస్తున్నా. మూడు రోజుల క్రితం రూ.2 లక్షల్లోపు రుణమాఫీ అయినట్టు తెలిసి బ్యాంకుకు వెళ్లి అడిగితే మాఫీ కాలేదని చెప్పిన్రు. మా గ్రామంలో చాలామంది రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదు. రుణమాఫీ చేసి నాకు న్యాయం చేయాలి.

**- కూకట్ల వీరన్న, పోచారం, మహబూబాబాద్ జిల్లా**

## మేం రైతులం కాదా? మాకెందుకు మాఫీ కాదు



నా భర్త ప్రభాకర్ పేరున రూ.2 లక్షలు తీసుకున్నం. దానికి వడ్డీ కలిపితే రెండు లక్షలు దాటుతది. వడ్డీ పైసలు కడుతామని బ్యాంకుకు పోతే పట్టించుకునే వారే లేరు. కొందరికే మాఫీ అయితే ఎలా? మేం రైతులం కాదా?

**- కొత్తూరు తిరుపతమ్మ, జంగాలపల్లి, ములుగు జిల్లా**

## ● మా ఇంట్లో ఎవరికీ మాఫీ చేయలే..



మా ఇంట్లో నేను, నా భార్య రాజ్యలక్ష్మి, కొడుకులు సేనాపతి, సతీశ్ ఉంటున్నాం. అందరికీ ఒకటే రేషన్ కార్డు ఉన్నా, వేర్వేరుగా ఉంటున్నాం. పట్టాపాస్ పుస్తకాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి. అయితే, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రుణమాఫీలో మాలో ఒక్కరికి కూడా కాలేదు. నా పేరు మీద రూ.1.50 లక్షలు, నా భార్య పేరు మీద రూ.2.74 లక్షలు, నా కొడుకు సతీశ్ పేరున రూ.98 వేలు, సేనాపతి పేరుమీద రూ.1.10 లక్షల రుణం ఉన్నది. మాలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలె. గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినం. వ్యవసాయ అధికారులను కలిసినం. ఎవరూ సమాధానం చెప్పడం లేదు. మా లెక్క మా ఊరిలో చాలామంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

**- మారెల్ల కొమురయ్య రైతు, కాశీంపల్లి, భూపాలపల్లి**


